మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 165
పేజీలు : 3

శనివారం 10 జనవరి, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను

కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.

అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత, కొత్త వారికి అవకాశం కలదు. వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.

GSTIN:36FDKPS1308P1ZX
టి-మీడియా సామాజికం ... ప్రజల పక్షం...
NEWS MEDIA
epaper,www.tmedia.net.in YouTube facebook

# బకాయిల 'పంచాయితీలు'



## ట్రాక్టర్‌లో డీజిల్ కూడా పోయలేని దుస్థితి

### చేతులెత్తేసిన కార్యదర్శులు



**టి మీడియా, జనవరి9, హైదరాబాద్ బ్యూరో :**
ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని గ్రామపంచాయతీల్లో రెండేళ్లుగా పాలకవర్గాలు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడం, నిధుల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం ప్రదర్శించటం తదితర కారణాలతో గ్రామ పాలన గాడితప్పింది. కొన్ని గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తమైంది. పంచాయతీ ట్రాక్టర్?లో డీజిల్? కూడా పోయలేని దుస్థితి దాపురించింది. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక కార్యదర్శులు చేతులెత్తేశారు. అనేక చోట్ల గత పాలకవర్గాలతో పాటు, ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులు సొంత డబ్బులతో చేపట్టిన పనులకు ఇప్పటికీ పైసా విడుదల కాలేదు.

**ఎదురుచూపులు**
ఇటీవల పంచాయతీ ఎన్నికలు ముగిసి నూతన పాలకవర్గాలు కొలువుదీరాయి. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కానుండటంతో పాత సర్పంచుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అప్పులు తెచ్చి ఊరి కోసం ఖర్చు చేశాం. ఇప్పుడు ఆ నిధులు తమకు అందుతాయా అని మాజీ సర్పంచులు ఆరా తీస్తున్నారు. అయితే పంచాయతీ అభివృద్ధి పద్దు నుంచి బకాయిలను నూతన పాలకవర్గాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ తరుణంలో కేంద్రం నిధులు పాత గాయాలను మాన్పుతాయా కొత్త వివాదాలను తీసుకొస్తాయా అనేది ఆసక్తికరంగా మారింది.ఇంకో వైపు ప్రత్యేకాధికారుల పాలనలో అత్యవసర పనుల కోసం సొంతంగా ధనం వెచ్చించిన కార్యదర్శులు సైతం బిల్లుల కోసం దస్త్రాలు సిద్ధం చేస్తుండటం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే పంచాయతీ నిధులను ప్రాధాన్య క్రమంలో వెచ్చిస్తామని ఖమ్మం జిల్లా పంచాయతీ నిధులను ప్రాధాన్య క్రమంలో వెచ్చిస్తామని ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు తెలిపారు.

**పాలకవర్గాలకు పెనుసవాల్**
నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు చేపట్టగానే నిధుల కొరత పెనుసవాల్?గా మారింది. కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతో కొత్త పనులు చేపడతారా? లేదా పాత బాకీలు తీర్చుతారా? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది. ఉభయ జిల్లాల్లో గత సర్పంచులకు చెల్లించాల్సిన బకాయిలే సుమారు రూ.60 కోట్లు ఉన్నాయి.

**ఖమ్మం జిల్లాలో**
ప్రత్యేకాధికారుల పాలనలో చేప్టటిన పనులకు సంబంధించి రూ. 19.31 కోట్లు చెల్లించాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేకాధికారుల పాలనలో చేపట్టిన పనుల లెక్కలు ఇంకా తేలలేదు. ఇవి సుమారు రూ. 10 కోట్ల వరకు ఉండొచ్చు. పాత బాకీలను తీర్చుకూనే గ్రామాల్లో పాలనను గాడిన పెట్టాల్సిన బాధ్యత కొత్త పాలక వర్గాలపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కేంద్ర ఆర్థిక సంఘం నిధులు**
పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపాదికన నిధులు మంజూరు చేస్తోంది. నెలకు ఒక్కో వ్యక్తికి రూ. 80 నుంచి రూ. 90 చొప్పున కేటాయిస్తోంది. ఇవి ప్రతి మూడు నెలలకు ఒక్క సారి, సంవత్సరంలో నాలుగు విడతలుగా అందిస్తోంది.

**రాష్ట్ర ఆర్థిక సంఘం**
రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు సైతం క్రమం తప్పకుండా మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇవి కూడా గ్రామపంచాయతీ జనాభా ప్రాతిపదికన ఇస్తారు. కొన్ని సంవత్సరాలుగా ఈ నిధులు విడుదల కావడం లేదు. దీనికి బదులుగా ప్రభుత్వం మల్టీ పర్పస్ వర్కర్లకు వేతనాలు, విద్యుత్తు బిల్లులు చెల్లిస్తోంది.
సాధారణ నిధులు : ఇవి గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకునే నిధులు. వీటిని పెంచుకునేందుకు పంచాయతీలు ప్రణాళికలు రచించి వాటిని అమలు చేయాల్సి ఉంటుంది.

**పన్నుల వసూలు**
గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ రకాల పన్నులు వసూలు చేస్తారు. ఇంటి పన్ను, గృహ నిర్మాణ అనుమతుల కోసం చెల్లించే పన్ను, ఆస్తి మార్పిడి, కుళాయి పన్ను, దాతల నుంచి అందేవి దీని పరిధిలోకే వస్తాయి.



## గొడవ కావాలా, నీళ్లు కావాలా

- సీఎం రేవంత్‌రెడ్డి

**టి మీడియా, జనవరి9, హైదరాబాద్ బ్యూరో :**
రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కోర్టుల్లో కాకుండా మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని సీఎం విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

**మన సమస్యలు మనమే పరిష్కరించుకుందాం**
పంచాయితీ కావాలా? నీళ్లు కావాలా? అని తనను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వివాదాలు కావాలా పరిష్కారం కావాలా అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతానన్నారు. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందామన్నారు. ఆంధ్రప్రదేశ్? ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి అని విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని రేవంత్ రెడ్డి అన్నారు.తాము వివాదాలు కోరుకోవడం లేదని పరిష్కారం కోరుకుంటున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు రాజకీయ ప్రయోజనాలు కాదు ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నామన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పొరుగు రాష్ట్రం సహకారం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు రాష్ట్రాలు(ఏపీ, తెలంగాణ) పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అశాభావం వ్యక్తం చేశారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర,



## కబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు

- సీఎం చంద్రబాబు

**టి మీడియా, జనవరి9, తూర్పుగోదావరి :**
కరోనా సమయంలోనూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదికలో సభలో పాల్గొని మాట్లాడారు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదని అన్నారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని 'మీ భూమి – మీ హక్కు' అని ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు. రాజముద్ర వేసి పాస్‌బుక్‌లు ఇస్తామని హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేర్చామని సీఎం తెలిపారు.గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు ఈనెల 11 వరకు పాస్‌బుక్‌లు ఇస్తున్నామని సీఎం వెల్లడించారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా చూడాలని అధికారులకు చెప్పానని ఆ విధంగా ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, మిగతా సిబ్బంది మనసుపెట్టి పని చేయాలని ఆదేశించారు. వచ్చే నెలలో మళ్లీ సర్వే చేసి పాస్‌బుక్‌లు ఇస్తామని తెలిపారు. ఒక్కసారి ప్రింట్ అయ్యాయంటే ఇక జీరో మిస్టేక్స్ ఉండాలని సూచించారు. భూమికి సంబంధించి 29

మిగతా 3లో..

## రూ.కోట్లు కొల్లగొట్టిన నెట్ సెంటర్ దందా

- భూ భారతి పోర్టల్‌లో లొసుగు

**టి మీడియా, జనవరి9,జనగామ :**
భూముల రిజిస్ట్రేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్?ను కొందరు పక్కదారి పట్టిస్తున్నారు. ఆ పోర్టల్?లో ఉన్న లొసుగును ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ ఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఓ వ్యక్తి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాదగిరిగుట్ట ప్రాంతానికి చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే?**
భూ భారతి పోర్టల్‌లో ఓ లొసుగును ఆసరాగా చేసుకుని ఓ ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వాహకుడు సైబర్ మోసానికి తెర తీశాడు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి నెట్ బ్యాంకింగ్ ద్వారా తక్కువ నగదు పంపుతూ రెవెన్యూ శాఖకు రావాల్సిన రూ.కోట్ల సొమ్మును కాజేశాడు. ఇంటర్నెట్ సెంటర్?ల నిర్వాహకులు భూభారతిలో స్లాట్లను బుక్ చేస్తూ, భూముల రిజిస్ట్రేషన్ సొమ్మును నెట్ బ్యాంకింగ్ విధానం ద్వారా చెల్లిస్తుంటారు. ఒక్కోసారి రూ.లక్షల్లో చెల్లించాల్సి రావడం, అంత మొత్తం ఖాతాల్లో లేకపోవడం లాంటి సమస్యలతో జనగామ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు వైపు ఉన్న మూడు కేంద్రాల నిర్వాహకులు యాదగిరిగుట్టకు చెందిన ఓ






ఇంటర్నెట్ నిర్వాహకుడితో ఒప్పందం చేసుకున్నారు.

**రూ.లక్షకు రూ.5 వేల కమీషన్ తీసుకుని**
ఇంటర్? నెట్ సెంటర్ నిర్వాహకుడు రూ.లక్షకు రూ.5 వేల కమీషన్ తీసుకొని వారికి సంబంధించిన స్లాట్లకు భూ భారతి పోర్టల్ ద్వారా రెవెన్యూ శాఖ (సీసీఎల్ఏ)కు నగదు చెల్లించే వాడు. అయితే పోర్టల్‌లో 'ఎడిట్' ఆప్షన్‌ను కనుగొన్న అతను, తక్కువ డబ్బులను చెల్లించి మిగతాది కాజేయడం మొదలుపెట్టాడు. ఉదాహరణకు రూ.1,50,000 చెల్లించాల్సి ఉంటే, దాన్ని రూ.1,500గా మార్చి చెల్లించేవాడు. ఈ విషయం సీసీఎల్ఏ అధికారులకు కూడా తెలిసేది కాదు. మూడు రోజుల కిందట ఓ ఇంటర్‌నెట్ కేంద్రం నిర్వాహకుడు తను బుక్ చేసిన స్లాట్‌కు తక్కువ డబ్బులు చెల్లించినట్లుగా గుర్తించాడు. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ విషయంపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పోలీసుల అదుపులో నిందితుడు**
తమకు అందిన ఫిర్యాదు మేరకు వరంగల్ సీసీఎస్? పోలీసులతో కలిసి కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు యాదగిరిగుట్టకు చెందిన నిందితుడుని అదుపులోకి తీసుకున్నారు. అసలు ఏవిధంగా మోసాలకు పాల్పడుతున్నాడు? ఇప్పటి వరకు ఇలా ఎన్ని చేశాడు? అనే అంశాలపై అతడిని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అతను జనగామతో పాటు యాదాద్రి, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోనూ ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్లుగా తెలిసింది. పోలీసులు రేపోమాపో నిందితుడి అరెస్టును చూపించి, పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లుగా సమాచారం. గురువారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్?లు జనగామ తహసీల్దారు ఆఫీస్?కు వెళ్లి భూభారతి పోర్టల్‌ను పరిశీలించారు.

**మార్చినాటికి నూతన పోర్టల్ అందుబాటులోకి**
సర్వే, స్టాంపులు, రెవెన్యూ శాఖలకు సంబంధించి భూముల సమాచారమంతా ఒకేచోట తెలుసుకునేలా మార్చి నాటికి కొత్త భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు ఇటీవల రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయేతర, దేవాదాయ, అటవీ, వక్ఫ్ తదితర భూముల వివరాలన్నీ ఈ పోర్టల్‌లో పరిశీలించవచ్చని తెలిపారు. రెవెన్యూ శాఖ అందుబాటులోకి తీసుకురానున్న పూర్తిస్థాయి భూ భారతి పోర్టల్? తెలంగాణ ప్రజలకు ఇక బహుళ ప్రయోజనకారిగా మారబోతుందన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే దాదాపు కొలిక్కి రాగా, కొన్నిరోజులు ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నట్లుగా సమాచారం. కొత్త పోర్టల్? అందుబాటులో వచ్చినట్లయితే పలు రకాల సేవలు ఒకే చోట లభ్యం కానున్నాయి. దీనివల్ల ప్రజలకు సమయం ఆదా కానుంది.

## ఘోర రోడ్డు ప్రమాదం

### బస్సు లోయలో పడి ఏడుగురు మృతి



**టి మీడియా, జనవరి9, సిర్మౌర్ :**
హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలోకి పడిపోయింది . ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం సిర్మౌర్ జిల్లాలోని రేణుకాజీ అసెంబ్లీ నియోజకవర్గంలో చోటు చేసుకుంది.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేటు బస్సు ప్రయాణికులతో వెళ్తోంది. అయితే బస్సు హరిపుర్ధార్ మార్కెట్ సమీపంలోకి రాగానే ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి 60 మీటర్ల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

- సేవలు, దర్శనాలు రద్దు

**టి మీడియా, జనవరి9 , తిరుమల :**
ఈ నెల 25న రథసప్తమిని పురస్కరించుకుని శ్రీవారి సన్నిధిలో టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. రథసప్తమి రోజు ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని, వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి జనవరి 24న ఎలాంటి సిఫారసు లేఖలూ స్వీకరించమని టీటీడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. రథసప్తమి సందర్భంగా కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేశారు. తిరుపతిలో ఈ నెల 24వ తేదీ నుంచి 26 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ చేయరు.

**భక్తులకు తితిదే సూచనలు**
రథసప్తమి సందర్భంగా పలు సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు అష్టాదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలు రద్దుచంటి బిడ్డల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐలు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల ప్రివిలేజ్ దర్శనాలు రద్దుతిరుపతిలో ఈ నెల 24వ తేదీ నుంచి 26 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ చేయడం లేదుప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు కూడా రద్దు.బ్రేక్ దర్శనాలకు ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదు ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 దర్శనం) టోకెన్లు ఉన్న భక్తులు వేచి ఉండకుండా ఉండేందుకు నిర్ణీత సమయంలో క్యూ కాంప్లెక్స్ వద్ద రిపోర్టు చేయాలి ఒకేరోజు సప్త వాహనాలపై శ్రీవారు: జనవరీ 25వ తేదీన ఉదయం 5:30 గంటలకు సూర్యప్రభ వాహన సేవతో మొదలయ్యి, రాత్రి 9 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో వాహన సేవలు ముగియనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. రథసప్తమి వేడుకలకు పెద్దఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. మాడవీధుల్లో వాహన సేవలు తిలకించేందుకు వేచి ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, నీరు, మజ్జిగ వంటివి పంపిణీ చేస్తామన్నారు.



గ్యాలరీల్లోని ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా**
మేదరమిట్ట, ఎస్వీ మ్యూజియం నుంచి మాడవీధుల్లోకి ప్రవేశించే మార్గం దగ్గర గతంలో తోపులాటలు చోటు చేసుకున్నాయి. సాధారణంగా ప్రత్యేక వేడుకలప్పుడు

మిగతా 3లో..

# విదేశాంగ విధానం ఊగిసలాడుతోంది

- ఖర్గే ఫైర్



**టి మీడియా, జనవరి9, ఢిల్లీ బ్యూరో :**
మోదీ సర్కారు విదేశాంగ విధానం ఊగిసలాడుతోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. విదేశాంగ విధానంలో స్థిరత్వం లేకపోవడం వల్ల దేశ ప్రజలు మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన మండిపడ్డారు. భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం చైనా కంపెనీలు బిడ్స్ దాఖలు చేయకుండా ఐదేళ్ల క్రితం అమల్లోకి తెచ్చిన పరిమితులను తొలగించాలనే కేంద్రం యోచనను ఖర్గే తప్పుపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు.

**మోదీ చెప్పిన దానికి భిన్నంగా పరిస్థితి**
'దేశాన్ని తలవంచనివ్వను' అని ప్రధాని మోదీ చెప్పగా, ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోందని ఖర్గే ఫైర్ అయ్యారు. రెండు తాజా ఉదాహరణలను చూస్తే, చైనా కంపెనీలకు భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపుపై ఐదేళ్లుగా ఉన్న బ్యాన్‌ను ఎత్తేసే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. చైనాకు క్లీన్ చిట్ ఇవ్వడం ద్వారా గల్వాన్‌లో భారత్ కోసం ప్రాణాలిచ్చిన వీర సైనికులను అవమానించేలా మోదీ వ్యవహరించారని విమర్శించారు. ఇప్పుడు చైనా కంపెనీలను భారత్‌లోకి ఆహ్వానించేందుకు మోదీ రెడ్ కార్పెట్ వేస్తున్నారన్నారు. ఈ విధమైన చర్యల ద్వారా చైనాపై తన ఆగ్రహం వట్టిదేనని ప్రధాని నిరూపించుకున్నారని ఖర్గే తెలిపారు.

**ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ మౌనం సరికాదు**
"రష్యా నుంచి భారత్ చమురును కొంటున్న అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మౌనం వహించడం సరికాదు. సరెండర్ అయ్యారు అనేందుకు అదొక సంకేతం లాంటిది. ట్రంప్ కళ్లలోకి కళ్లు పెట్టి మోదీ చూడలేకపోతున్నారు. అమెరికా అధ్యక్షుడిని 'సర్' అని భారత ప్రధాని సంబోధించడం కూడా సరెండర్ కావడం లాంటిదే. మా దృష్టిలో విదేశాంగ విధానం అంటే అన్నింటి కంటే దేశ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం. భారతదేశ అలీన విధానం, వ్యూహాత్మక స్వతంత్ర విదేశాంగ విధానాలకు నష్టాన్ని కలిగించేలా మోదీ సర్కారు వ్యవహరిస్తోంది. గడియారంలోని పెండ్యులమ్‌లా ఓసారి ఇటువైపునకు, మరోసారి అటువైపునకు భారత విదేశాంగ విధానం ఊగిసలాడుతోంది" అని ఖర్గే పేర్కొన్నారు.

**గల్వాన్ నుంచి టియాన్‌జిన్ దాకా**
2020 జూన్ 15న గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఆ ఘటనలో పలువురు భారత సైనికులు అమరులయ్యారు. దీంతో భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం బిడ్లు దాఖలు చేయకుండా చైనా కంపెనీలపై బ్యాన్‌ను అమల్లోకి తెచ్చారు. అమెరికాలో 2025 సంవత్సరం ఆరంభంలో ట్రంప్ సర్కారు ఏర్పడింది. అది వరుసపెట్టి భారత్‌పై దిగుమతి సుంకాలను బాదింది. దీంతో అమెరికాకు భారతదేశ దిగుమతులు బాగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో 2024 అక్టోబరు 23న రష్యాలోని కజన్ నగరం వేదికగా భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ భేటీ అయ్యారు. సరిహద్దు వివాదానికి తెరదించాలని, సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలని ఇరువురు నిర్ణయించారు. గత సంవత్సరం(2025 ఆగస్టు 31 – సెప్టెంబరు 1) చైనాలోని టియాన్‌జిన్ వేదికగా షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సుకు కూడా ప్రధాని మోదీ హాజరయ్యారు.

**భారత్ వైఖరిలో మార్పునకు దారితీసిన పరిణామాలు**
గత ఐదేళ్లలో ఈ విధంగా చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం భారత విదేశాంగ విధానంపై పడిందని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు అంటున్నారు. ఒకప్పుడు అమెరికాకు అత్యంత సన్నిహితంగా భారత్ మెలిగేది. కానీ ట్రంప్ సర్కారు వైఖరి కారణంగా సీన్ మారిపోయింది. ఆనాడు అమెరికాకు చేరువయ్యే ప్రయత్నంలో చైనా విషయంలో భారత్ కఠిన వైఖరిని తీసుకుంది. ఇప్పుడు భారత్ స్నేహానికి విలువ ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా ట్రంప్ సర్కారు వ్యవహరిస్తుండటంతో మోదీ సర్కారు సైతం తన వైఖరిని మార్చుకుంది. చైనాతో వైరం కంటే స్నేహమే ప్రయోజనకరమనే భావనకు వచ్చింది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం పోటీపడే అవకాశాన్ని మళ్లీ చైనా కంపెనీలకు కల్పించాలనే అంశాన్ని మోదీ సర్కారు పరిశీలిస్తోంది.

# పేరుకేమండలం, సౌకర్యాలు శూన్యం

- మంత్రిని కోరిన గ్రామస్థులు

**టీ మీడియా, జనవరి 9, ఎండపల్లి:**
జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి మండలం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా, కనీస మౌలిక వసతులు లేకప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం పేరుకే మండలం హోదాదక్కిందని, సౌకర్యాలుమాత్రం శూన్యంగా ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలుతీవ్ర ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో కీలక సదుపాయాలు లేకపోవడంతో ,ప్రజలు తమ నిత్యఅవసరాల, ముఖ్యమైన పనుల కోసం ఇతరప్రాంతాలకు ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనివల్ల ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులువాపోతున్నారు. ఆర్థిక లావాదేవీల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోందని వారుపేర్కొన్నారు. మండలంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో పేదవిద్యార్థులు ఉన్నత విద్యకుదూరమవుతున్నారు.




యువతకు విద్యార్థులకు విజ్ఞానాన్ని, పోటీపరీక్షల సమాచారాన్ని అందించే గ్రంథలయం (లైబ్రరీ) లేకపోవడం వల్ల నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టంవాటిల్లుతోంది. శాంతి భద్రతలనిర్వహణకు, ప్రజలభద్రతకుముఖ్యమైన పోలీస్ స్టేషన్ సదుపాయం కూడా మండలంలో అందుబాటులోలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఉన్నప్పటికీ, కనీసం బెడ్ల సౌకర్యం కూడా లేకపోవడంతో అత్యవసర వైద్య సేవలకు వేరే ప్రాంతాలకు వెళ్లక తప్పడం లేదు. ఇది పలు సందర్భాల్లో ప్రాణాల మీదకు తెస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ప్రజల సౌకర్యాల మేరకు తక్షణ మేబ్యాంకులు, డిగ్రీ, జూనియర్ కళాశాలలు, లైబ్రరీ, పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీలో బెడ్ల సౌకర్యాన్ని కల్పించాలని గ్రామస్థులుకోరారు. అంతేకాకుండా, మండల కేంద్రంలో పక్కా ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మించాలని ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే,సాంఘిక సంక్షమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను విజ్ఞప్తి చేశారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఎండపల్లి మండలం సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరలోనేమౌలికసదుపాయాలను కల్పించాలని వారు కోరారు."మండలం ఏర్పాటు చేశారు కానీ వసతుల సంగతి మరిచారేమో" అంటూప్రజలుపెదవివిరుస్తున్నారు. ఎండపల్లికి మౌలిక వసతులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో వేచి చూడాలి.

# విద్యుత్ అధికారుల ప్రజా బాట

**టీమీడియా, జనవరి 9,ఎండపల్లి**
నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్ పీడిసిఎల్) జగిత్యాల జిల్లా విద్యుత్ వినియోగదారులకు మరింతచేరువ య్యేందుకు, వినియోగదారులకు విద్యుత్సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు 'ప్రజాబాట' 'కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏఈ బండిసమ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సిబ్బంది ప్రత్యేక మెయింటెనెన్స్‌నులు చేపట్టారు. పాతఫ్యూజులను తొలగించి, కొత్తవాటిని అమర్చారు . ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న చెట్లకొమ్మలను తొలగించి. విద్యుత్ అంతరాయం లేకుండా ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఏ ఈ బండి సమ్మయ్య మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ శాఖ అధికారులు ప్రతి గ్రామల ల్షేత్ర స్థాయిలో పర్యటించి ,ప్రజలనుం చినేరుగా సమస్యలను స్వీకరించి, వాటినితక్షణమే పరిష్కరించేందుకు చర్యలుతీసు కుంటారని మండలంలోని పలు గ్రామాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరాలోఅంతరాయాలు,బిల్లింగ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ వంటి ఏదయినా సమస్యలు ఉంటే ఈ 'ప్రజా బాట' కార్యక్రమంలో పాల్గొని అధికారులద ృష్టికితీసు కురావాలని కొరారు. సామాన్య రోజుల్లో విద్యుత్ సంబంధిత అత్యవసర ఫిర్యాదుల కొరకు వినియోగదారులు 1912 అనే టోల్-ఫ్రీనంబర్‌నుసంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లోవిద్యుత్ అధికారులు ఎ ఈ బండి. సమ్మయ్య, సబ్ ఈ ఆర్ హరీష్,ఎల్ ఐ రవి,లైన్ మేన్ రమేష్, ఏ ఎల్ ఎంసాయి, మహేందర్, అన్ మాన్ శ్రీకాంత్, గ్రామస్థులు రమణ రెడ్డి,పోస్ట్ రాజేశం,రాజయ్య గౌడ్, పాల్గొన్నారు.




# జడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక బృందం తనిఖీ

**టీ మీడియా,జనవరి 9,ఎండపల్లి:**
ఎండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) ను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) నియమించిన ప్రత్యేక పరిశీలక బృందం సందర్శించింది. నోడల్ అధికారి అబ్దుల్ హమీద్ ఆధ్వర్యంలో ఈ తనిఖీ నిర్వహించారు. పరిశీలక బృందం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ తీరును క్షణ్ణంగా పరిశీలించారు. తనికిలో భాగంగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు,విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య,పాఠశాలలో నిర్వహిస్తున్న సైన్స్ ప్రయోగాలు,గ్రంథలయ నిర్వహణ పద్ధతులను పరిశీలించారు. బృంద సభ్యులు ఉపాధ్యాయుల యొక్క బోధనా శైలిని ప్రత్యేకంగా పరిశీలించి,సంతృప్తిని వ్యక్తంచేశారూ. మెరుగుదల కోసం కొన్ని నిర్మాణాత్మక సూచనలుఅందించారు. మధ్యాహ్నం,నోడల్ అధికారి అబ్దుల్ హమీద్ ప్రత్యేక ఉపాధ్యాయ సమావేశంలో పాల్గొన్నాని. తమ పరిశీలనలో గమనించిన అంశాలను వివరిస్తూ, పాఠశాల ఆవరణ ప్రశాంతంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండి, నేర్చుకోవడానికి అత్యంత అనుకూలంగా ఉందని ప్రశంసించారు. వివిధ రికార్డుల నిర్వహణ విద్యార్థుల అభ్యాసన బాగున్నాయనికొనియాడారు. మధ్యాహ్న భోజన పథకం రుచికరంగా నాణ్యతా ప్రమాణాలతో కూడుకొని ఉందని ఆయన ప్రత్యేక మైన సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం,రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉన్నత శ్రేణిలో,100% ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షంచారు. ఈ లక్ష్యన్ని చేరుకోవడానికి ఉపాధ్యాయులువిద్యార్థులకు చక్కని మార్గదర్శనం చేయాలని హితవు పలికారు. అంతేకాక, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు అన్నీ తామై,వారిలో నైతిక విలువలు,సామాజిక స్పృహను కూడా పాఠ్యాంశ బోధనలో భాగంగాపెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బృంద పరిశీలకులు విజయ్,చుక్కయ్య, నోడల్ అధికారి అబ్దుల్ హమీద్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.






# ఉపాధ్యాయుల సంక్షమమే పిఆర్టియు టిఎస్ ధ్యేయం

**టీ మీడియా ,జనవరి 9 ,పెబ్బేరు :**
పెబ్బేరు పట్టణంలో స్థానిక ఎం ఆర్ సి భవనం నందు పి ఆర్ టి యు టి ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ స్థానిక ఎంఈఓ ఎస్ జయరాములు చేతుల మీదుగా నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి పి ఆర్ టి యు టి ఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిన్న రాములు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షమమే పి ఆర్ టి యు టీఎస్ ధ్యేయం అని ఉపాధ్యాయ సంక్షమం కోసం కృషి చేస్తున్న ఏకైక సంఘం పిఆర్టియు టి ఎస్ అని త్వరలోనే ఉపాధ్యాయులకు మంచి పిఆర్సి ఇప్పించేందుకు కృషి చేస్తుందని వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన పదోన్నతులు చేపడుతుందని అన్నారు ఇట్టి కార్యక్రమంలో పెబ్బేరు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఏ విష్ణువర్ధన్ రావు పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి నరసింహ గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోకవర్ధన్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి దయానంద మహిళా కార్యదర్శి శర్మిష్టా దేవి క్రియాటివిటీఎస్ పెబ్బేరు మండల అసోసియేట్ అధ్యక్షులు బి రవికుమార్ పిఆర్టియు టీఎస్ ప్రాథమిక సభ్యులు ఇంద్ర రావు నాగిరెడ్డి భాస్కర్ రెడ్డి హరికుమార్ రాధా రాణి సుమిత్ర భారతి వరలక్ష్మ భాగ్యచంద్రిక శాంతాబాయి సుమతి పావని గారు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# విజేత జట్టుకు ప్రథమ బహుమతి ప్రదానం

**టీ మీడియా, జనవరి 9 ,పెబ్బేరు :**
పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో సుభాష్ యూత్ వారు నిర్వహించిన బీసీ కాలనీ ప్రీమియర్ లీగ్ మూడవ ఎడిషన్ బిపిఎల్-3లో భాగంగా మింటు 11 జట్టు స్కై వారియర్స్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మింటు 11 జట్టు ఘన విజయం సాధించింది ఈ సందర్భంగా విజేత జట్టుకు మొదటి బహుమతిగా నగదు దాత 15 000 రూపాయలను వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ అందజేశారు ఈ కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి మాజీ కౌన్సిలర్ సుష్మిత మహేందర్ గౌడ్ సంబు రాము సుభాష్ యూత్ సభ్యులు బీసీ కాలనీ యువకులు పాల్గొన్నారు.





# హై స్కూల్లో ముగ్గుల పోటీలు

**టీ మీడియా, జనవరి9 ,పెబ్బేరు :**
పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో చెలిమిల్లలోగల మాంటిసోరి హైస్కూల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు పిల్లలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు ఆటపాటలతో పాటుగా సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలని అన్ని రంగాల్లో ముందుండాలని సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డి రాజేందర్ గౌడ్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది.



# శాంక్షన్ అయిన ఆర్ఓబి ఆర్‌యుబి

**టీ మీడియా ,జనవరి 9, దేవరకద్ర :**
దేవరకద్రలో రైల్వే అండర్ బ్రిడ్జ్ లిమిటెడ్ హైట్ సబ్ వే ( ఆర్ యు బి ) ( ఆర్ఓబి ) ( ఎల్ హెచ్ ఎస్ ) సాంక్షన్ అయ్యిందని,ఫిబ్రవరి చివరి వారంలో టెండర్లను పిలవనున్నామన్నారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తో డీకే అరుణమ్మ భేటీ అయ్యారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలో దేవరకద్ర చుట్టూ గ్రామాల ప్రజలు, రైల్వే అండర్ బ్రిడ్జ్ లేనందున వ్యాపారస్థులు, వాహనదారులు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని దేవరకద్ర ప్రాంతాల్లో రోడ్డు అండర్ బ్రిడ్జి ( ఆర్ యు బి ), రోడ్డు ఓవర్ బ్రిడ్జి ( ఆర్ఓబి )లతో పాటు లిమిటెడ్ హైట్ సబ్ వే ( ఎల్ హెచ్ ఎస్)ల నిర్మాణం కొరకు గతంలో అందజేసిన వినతిపత్రాల సంబంధించిన పురోగతి పై రైల్వే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.



# కలసికట్టుగా పోరాడుదాం కదలిరండి

**టీ మీడియా, జనవరి 09,టేక్మాల్ ప్రతినిధి:**
టేక్మాల్ మండలంలోని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ మల్లేశం మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందికరంగా తీసుకువచ్చిన నాలుగు చట్టాలను రద్దు చేయడం కోసం ప్రజలందరూ కలిసికట్టుగా పోరాటం చేసి రద్దు చేసే విధంగా ఉద్యమం చేయడానికి అందరూ రావాలని సిఐటియు మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం టేక్మాల్ కు వచ్చిన జీపు జాత వద్ద ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. లేబర్ కోడ్స్, బీబీ రాంజీ చట్టం, జాతీయ విత్తన శుద్ధి సవరణ బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులు, పేద బడుగు బలహీనవర్గాలు వ్యవసాయ కార్మికులకు పొట్ట కొట్టే విధంగా ఉన్నాయన్నారు. 2019లో ఉన్న వేతన కోడ్ను సవరిస్తూ 2020లో అసంఘటితరంగా కార్మికుల పొట్ట కొట్టే విధంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్ను వ్యతిరేకిద్దామని ఆయన పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టంలో నీరుగాచే విధంగా వికసిద్భారత్ జి రాంజీ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు ఈ చట్టం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 90 శాతం మంది కూలీలు గ్రామీణ ప్రాంతంలో ఉండి జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు అన్నారు. ఉపాధి హామీలు 100 రోజులు పని కల్పించి రోజుకు 37 రూపాయలకు కూలీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ ఈ చట్టాన్ని నీరుగాచే విధంగా బిజెపి ప్రభుత్వం, జి రాంచి చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. ఈ చట్టం కార్పొరేట్ శక్తులకు అనుకూలించే విధంగా ఉందన్నారు. ఉపాధి కూలీలు ఈ చట్టం రద్దుకై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విత్తన చట్టాన్ని రద్దు చేయాలి, విత్తన చట్టం కేంద్రం ఉన్న బిజెపి ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకువస్తే, 2004లో, ఢిల్లీలో రైతులు దీక్ష చేసి ఈ చట్టాన్ని నిలుపుదల చేయించారు అది తాత్కాలికంగా నిలుపుదల చేశారు కానీ 2025లో చట్టాన్ని తీసుకుని వచ్చి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే లాగా సవరణ చేశారన్నారు ఈ చట్టాన్ని రద్దు చేయడం కోసం రైతులు మరోసారి ఉద్యమాన్ని చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. విద్యుత్ సవరణ చట్టం 2025 సంవత్సరంలో, బిజెపి ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందంటారు. నిజానికి ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండాల్సిందేనని, కానీ బిజెపి ప్రభుత్వం బలవంతంగా ఈ చట్టం తీసుకువచ్చి రైతులకు స్మార్ట్ మీటర్ల ను తమబోరు బావుల వద్ద బిగించేందుకు ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఇది గనుక జరుగుతే రైతుల గుండెలపై కరెంటు భారం పడనుందని ఏ రైతు కూడా వ్యవసాయం చేసే పరిస్థితిలో ఉండరని గుర్తు చేశారు ఈ నాలుగు లేబర్ కూడా చట్టాలను రద్దు చేయడం కోసం ప్రజలందరూ ఐక్యంగా కలిసికట్టుగా పోరాటాలు చేస్తే తప్ప కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను రద్దు చేయాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేశం, సిఐటియు నాయకులు బసవరాజ్, నరసమ్మ, పెంటయ్య, లక్ష్మణ్, సత్యమ్మ తదితరులు ఉన్నారు.






# హిందువులపై దాడులు


- బంగ్లాదేశ్‌కు వార్నింగ్

**టి మీడియా, జనవరి9, ఢిల్లీ బ్యూరో :**
బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడుల్ని భారత్ తీవ్రంగా ఖండించింది. దాడుల్ని ఆపాలని బంగ్లా ప్రభుత్వానికి భారత్ సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ.. మైనారిటీ హిందువులపై దాడులు ఆపేందుకు బంగ్లా ప్రభుత్వం వేగంగా, కచ్చితంగా చర్యలు తీసుకోవాలని కోరారు.'బంగ్లాలో మైనారిటీలైన హిందువులపై వరుసగా జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. హిందువుల ఇండ్లపై, వ్యాపార సంస్థలపైనా అతివాదులు దాడి చేస్తున్నారు. వ్యక్తిగత ద్వేషాలు, రాజకీయ కారణాల వల్ల జరుగుతున్న ఈ మతపరమైన దాడుల్ని వెంటనే ఆపాలి. ఈ దాడులు మైనారిటీలలో భయాన్ని, అభద్రతా భావాన్ని పెంచుతున్నాయి " అని రణధీర్ అన్నారు. మరోవైపు బంగ్లాలో హిందువులపై దాడుల గురించి బ్రిటన్ ఎంపీ ప్రీతి పటేల్ కూడా స్పందించారు. బ్రిటన్ ఫారెన్ సెక్రటరీకి లేఖ రాశారు. దాడుల్ని ఆపేందుకు సహకరించాలని కోరారు. హిందువులపై హత్యలతో బంగ్లాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, మత స్వేచ్ఛను గౌరవిస్తూ ఈ దాడులు ఆపేలా చూడాలని ఆమె లేఖలో కోరారు. ఈ అంశంలో బ్రిటన్ ప్రభుత్వం జోక్యం చేసుకుని, తమ అధికారాన్ని వాడాలని ఆమె కోరారు. బంగ్లాలో పరిస్థితులు అదుపులోకి తెచ్చేందుకు, స్థిరత్వానికి సహకరించాలన్నారు. ఇటీవలి కాలంలో బంగ్లాలో హిందువులపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత

**టీమీడియా, జనవరి 9, ముదిగొండ**
ముదిగొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యాప్తంగా జారీ అయిన 152 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తహశీల్దార్ సునీతా ఎలిజబెత్, ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పాలన అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు.

కాగా వెంకటాపురం గ్రామానికి చెందిన బంక ఉమా, గంట ఉష, సుతారి పద్మావతి, బొమ్మగాని నాగలక్ష్మిలకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను సర్పంచ్ కందుల బాలచందర్, తహసీల్దార్, ఎంపీడీఓ చేతులమీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, కళ్యాణి, జానీమీయా, జిపివోలు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




# ఎంపీపీఎస్‌లో సంక్రాంతి వేడుకలు

**టీమీడియా,జనవరి9,ఎండపల్లి:**
మండలకేంద్రంలో సంక్రాంతిపండుగ నుపుం స్కరించుకు నిముందస్తుగా ఎండపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో,సంక్రాంతి పండుగ యొక్క ప్రాముఖ్యతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగు రంగుల రంగవల్లులను వేసి పాఠశాల ఆవరణ మొత్తాన్ని అత్యంత అందంగా అలంకరించారు. విద్యార్థినిలు వేసిన ప్రతి ముగ్గు కూడా పండుగ గొప్పతనాన్ని తెలియజేస్తూ చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులలో సాంప్రదాయాలు, కళల పట్ల ఆసక్తిని పెంచాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా జరుపుకునే ఈ ముగ్గుల పండుగ,మన సంస్కృతికి అద్దం పడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి. రవీందర్ రెడ్డి ఉపాధ్యాయులు ఎన్.రమేష్, ఎం.శ్రీధర్,పి. రాజశేఖర్, ఎస్.తిరుపతి, ఆర్.శ్రీదేవి, కె.పుష్పలత, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# తహసీల్దార్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

- పలు దస్త్రాలు దగ్ధం



**టి మీడియా, జనవరి9 , ఎన్టీఆర్ :**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ కంచికచర్ల తహసీల్దార్? కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కార్యాలయ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీనితో కార్యాలయంలోని రికార్డు రూములో ఉన్న దస్త్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కార్యాలయం లోపలి నుంచి భారీగా పొగలు రావడం గమనించిన సిబ్బంది వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు.

**తక్షణమే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది**

సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. తక్షణమే స్పందించి అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలా కియా, ఆర్డీఓ బాలకృష్ణ, నందిగామ ఏసీపీ తిలక్?లు పరిశీలించారు.

**రికార్డులు దగ్ధం**

అగ్నిప్రమాదంలో స్టోర్? రూమ్?లో భద్రపరిచిన ప్రభుత్వ రికార్డులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మరో ప్రధాన రికార్డులు ఉన్న రూము మాత్రం సురక్షతంగా ఉన్నది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఎటువంటి రికార్డులు కాలిపోయాయి, ఎంత నష్టం జరిగింది అనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది.

**చలిమంట వేయటంతో అగ్ని ప్రమాదం జరిగిందా**

ఫైర్, రెవెన్యూ,పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి ప్రమాదం ఏ విధంగా జరిగిందో తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కార్యాలయం పక్కనున్న కేడీసీసీ బ్యాంక్ వాచ్‌మెన్ చలిమంట వేయటంతో అగ్ని ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ అగ్ని ప్రమాదం చలిమంట వల్ల వచ్చిన మంటలతో ప్రమాదం జరిగిందా? లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? లేకపోతే ఎవరైనా కావాలనే చేశారా? అనే కోణంలో పరిశీలన చేస్తున్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు జరిగిన తర్వాత అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు వెల్లడి**

దీనిపై ఆర్డీవో బాలకృష్ణ మాట్లాడుతూ ఉదయం 6 గంటల సమయంలో సమాచారం రాగానే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. అగ్ని ప్రమాదంలో పాత రికార్డులు మాత్రమే కొన్ని ధ్వంసం అయ్యాయి. మిగిలిన రికార్డులన్నీ క్షమంగా ఉన్నాయి. దీనిలో ఎటువంటి అనుమానాలకు తావులేదు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన అయినా పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దీన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ జిల్లాలోని 22 తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డులు రూములు భద్రతపై జాయింట్ కలెక్టర్ ఇలా కియా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యాలయం రికార్డు రూమ్ పక్కనే చలిమంట వేసిన విషయం వాస్తవమేనని, కేడీసీసీ బ్యాంకు వాచ్‌మెన్ చలిమంట వేశారని తెలిపారు. ఇదిలా ఉండగా, కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. స్టేషన్ ముఖ ద్వారం వద్ద అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు కమ్మేయడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటల్ని అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.



# సుప్రీంకోర్టు సంచలన తీర్పు..

- ఏపీ హైకోర్టు తీర్పు కొట్టివేత

**టి మీడియా, జనవరి9, ఢిల్లీ బ్యూరో :**

సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పు వెలువరించింది.. అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన కేసుల ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయడం కుదరదు.. అవి దర్యాప్తుకు అనుగుణంగా కొనసాగాలి అని స్పష్టం చేసింది.. ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్, విజయవాడలో నమోదు చేసిన అన్ని ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తుకు పంపండి అని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఎఫ్ఐఆర్‌లపై దర్యాప్తు పూర్తయ్యే సరికి ఆరు (6) నెలల్లో తుది నివేదిక సమర్పించాలని స్పష్టమైన సమయపరం కూడా ఇచ్చింది. ప్రతివాదుల్ని అరెస్ట్ చేయకూడదు, అయితే వారు దర్యాప్తులో పూర్తిగా సహకరించాల్సి ఉంటుందని చెప్పింది. ఈ కేసులకు సంబంధించినవి అయినా, ఇప్పటికే ఉన్న ఎఫ్ఐఆర్‌లు ఏ హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న దర్యాప్తులకు సంబంధించిన పిటిషన్లను హైకోర్టులు ఒక్కటి కూడా రద్దు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది. ఏపీ హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టుగతంలో ఆయా ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసిన హైకోర్టు తీర్పు సుప్రీంకోర్టు ద్వారా రద్దు చేయబడింది. ఎఫ్ఐఆర్‌లను రద్దుచేయడం సరైనది కాదు అని స్పష్టం చేసింది.. సీనియర్ పోలీసింగ్ అధికారులుగా నోటిఫై అయిన ఐదుగురు అధికారుల ఆధ్వర్యంలో దర్యాప్తు జరగాలని పేర్కొంది.. అయితే, సుప్రీంకోర్టు తీర్పులో రాష్ట్ర విభజన తర్వాత కూడా పాత చట్టాలు తప్పకుండా అమలులోనే ఉన్నట్లు స్పష్టంగా పేర్కొంది. పాత చట్టాలను మార్చకుంటే అవి ఇప్పటికీ అమలులోనే ఉన్నాయని, అవినీతి నిరోధక చట్టం కూడా వర్తించాల్సిన చట్టంగా ఉన్నదని తీర్పులో పేర్కొంది. అవినీతి నిరోధక చట్టం కింద పలు వ్యక్తులపై ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ ద్వారా ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. ఈ కేసులను సముచిత దర్యాప్తు ద్వారా సామరస్యంగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తోంది.



## ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

**టీ మీడియా ,జనవరి 9 ,ఆత్మకూరు :**

వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలోని దేశాయ్ మురళీధర్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దేశాయి ప్రకాష్ రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా స్కూల్ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మమ్మ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా మన సంస్కృతి సాంప్రదాయాలను చాటే విధంగా విద్యార్థులు చక్కగా ముగ్గులు వేసి ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థులందరూ మంచిగా చదివి ఉన్నత స్థానం ఎదగాలని అన్నారు ఈ కార్యక్రమంలో దేశాయి ప్రకాష్ రెడ్డి సేవా సమితి అధ్యక్షులు సయ్యద్ కలాం పాషా స్కూల్ ఉపాధ్యాయులు రాములు, ఆనందలక్ష్మి శ్రావణి, జ్యోతి,వరలక్ష్మి మాసుం బి,శ్రీలత,సిద్ధికు స్కూల్ సిబ్బంది తిరుపతి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు

**(మొదటిపేజీ తరువాయి...)**

భక్తులు ముందు రోజు రాత్రి నుంచే ఆలయ మాడవీధుల్లో ఉన్న గ్యాలరీలకు చేరుకుంటారు. మిగిలిన వారు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా ఎక్కడ అనుమతిస్తే అక్కడ వెళ్లేందుకు కూడా ప్రయత్నిస్తారు. ఇటువంటి సమయంలో తోపులాటలు, తొక్కిసలాటలు చోటు చేసుకునే అవకాశం ఉంది. దీనిని నివారించేందుకు ఆయా ప్రాంతాల్లో క్యూలైన్లను తితిదే ఏర్పాటు చేస్తుంది. తితిదే విజిలెన్స్ విభాగం, తిరుపతి జిల్లా పోలీసు విభాగం సమన్వయంతో ఈ భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నారు.

**రథోత్సవం ఇలా**

జనవరీ 25న ఉదయం 5.30 నుంచి ఉదయం 8 గంటల వరకు సూర్యప్రభ వాహన సేవ జరగనుంది. రథసప్తమి రోజు సూర్యోదయం ఉదయం 6.45 గంటలకు, ఉదయం 9-10 గంటలు, చిన్నశేష వాహనం సేవ,ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 , గరుడ వాహనం సేవ

మధ్యాహ్నం 1-2 గంటలు, హనుమంత వాహనం సేవమధ్యాహ్నం2-3గంటలు, చక్రస్నానం సాయంత్రం 4-5 గంటలు, కల్పవృక్షం సేవ సాయంత్రం 6-7 గంటలు, సర్వభూపాలం సేవరాత్రి 8-9 గంటలు,చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.

## గొడవ కావాలా, నీళ్లు కావాలా

**(మొదటిపేజీ తరువాయి...)**

తమిళనాడు ఇలా ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదన్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేస్తే తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుంది అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

**ప్రపంచ నగరాలతో పోటీ**

హైదరాబాద్? ప్రపంచ నగరాలతో పోటీపడుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని కొనియాడారు. పెట్టుబడులకు లాభం వచ్చేవిధంగా ప్రభుత్వం ప్రణాళికలు ఉన్నాయని ఆయన వివరించారు. ప్రపంచ స్థాయి దేశాలతో పోటీపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం తెలంగాణలో ఉందన్నారు. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన దేశం వారేనని ఆయన గుర్తుచేశారు.మీకు నీళ్లు కావాలా? వివాదం కావాలా? అంటే నేను నీళ్లు కావాలని కోరుకుంటా. నీళ్ల విషయంలో మనం రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి.పక్క రాష్ట్ర ముఖ్యమంత్రికి నేను విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణానదీలో ఉన్న పాలమూరు రంగారెడ్డి, కేఎల్ఐ, డిండి, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు ప్రాజెక్టులు అనుమతులకు అడ్డంకి పెట్టవద్దు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టుల అనుమతులకు సహకరించండి. అడ్డంకి పెట్టడం వల్ల పర్యావరణ, సీడబ్ల్యూసీ అనుమతులకు ఇబ్బందిగా మారింది. రుణాలు మంజూరు కాకపోవడం, కేంద్రసహకారం లేకపోవడం వల్ల రాష్ట్రంపై ఆర్థికభారం పడుతోంది. మాకు సహకరిస్తే మేము కూడా సహకరిస్తాం. మేము వివాదాలు కోరుకోవట్లేదు.. శాశ్వత పరిష్కారం కోరుతున్నాం. "- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి.

## కబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు

**(మొదటిపేజీ తరువాయి...)**

అంశాలపై ఫిర్యాదులు వచ్చాయని అన్నింటినీ పరిష్కరిస్తున్నామని సీఎం తెలిపారుఅలానే 22-ఏ భూములపై వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. రైతుల భూరికార్డులన్నీ బ్లాక్‌చైన్‌లో భద్రంగా ఉంటాయని, ఎవరైనా భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. చిన్న చిన్న భూతగాదాలు పెట్టుకోవద్దని ప్రజలందరినీ కోరుతున్నానని, ముందుగా కుటుంబసభ్యులు, బంధువులతో వివాదాలు వద్దని కోరారు. గొడవలు పడి కోర్టులకు వెళ్తే జీవితకాలం వృథ అవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు.గత పాలకులు గంజాయిని వాణిజ్య పంటగా మార్చారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికదే చివరిరోజు అదే చేసి చూపిస్తున్నాం. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ చనిపోయేందుకు కారణమయ్యారు. డాక్టర్ సుధాకర్ కుమారుడికి ఉద్యోగం ఇచ్చాం ఇంక రూ.కోటి సాయం చేశాం. గాడి తప్పిన పరిపాలనను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. 5 ఏళ్లకు ఒకసారి ప్రభుత్వం మారితే దానివల్ల నష్టం ఎక్కువ వస్తుంది. గతపాలకులు చేసిన విధ్వంసాన్ని సరిచేసేందుకే సమయం సరిపోతుంది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని సరిచేసేందుకు మూడేళ్లు పడుతుంది. ఇంకా వారి ప్రభుత్వం వల్ల పోలవరం, అమరావతి ఆలస్యమయ్యాయి."- చంద్రబాబు, సీఎం

**నదుల పక్కనే పెద్దపెద్ద నగరాలు**

నరకాసురిడి పాలన మళ్లీ రాకూడదని మనం కోరుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరి పుష్కరాలు వచ్చే 3 సార్లూ నేనే సీఎంగా ఉండటం నా అదృష్టమని చెప్పారు. సముద్రంలోకి వెళ్లే నీటిలో 300 టీఎంసీలు వాడుకుంటే కరవే ఉండదని అలానే పోలవరం పూర్తయితే నీటి సమస్యే ఉండదని తెలిపారు. పోలవరం నుంచి విశాఖకు అక్కడి నుంచి వంశధారకు తీసుకెళ్తామని రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని వెల్లడించారు. గొడవలు పెట్టుకుంటే వచ్చే ప్రయోజనాలు ఏమీ ఉండవని సూచించారు. పెద్దపెద్ద నగరాలన్నీ నదుల పక్కనే ఉన్నాయి. దీనిపై వైఎస్సార్సీపీ నేతలు ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. ఆఖరికి వైద్యకళాశాలలపైనా రాజకీయాలు చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విలేకరికు అండగా ఎమ్మెల్యే

- రూ.50 వేల ఆర్థిక సహాయం



**టీ మీడియా, జనవరి 9,మేడ్చల్:**

అనారోగ్యంతో బాధపడుతున్న విలేఖరి నర్సింగ్ కు కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కేపీ వివేకానంద గౌడ్ అండగా నిలిచారు. రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కే జగన్, బిఆర్ఎస్ డివిజన్ నాయకులు ఎమ్మెల్యే తరపున నర్సింగ్ కుటుంబాన్ని పరామర్శించి నగదును అందజేశారు. గతంలో నర్సింగ్ అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న వివేకానంద స్వయంగా వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాను అండగా ఉంటానని హామీలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కుతుబులాపూర్ యూనిట్ ఆధ్వర్యంలో ఆర్థిక పరిస్థితిని మరో మారు వివరించారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే పార్టీ కార్యకర్తలతో ఆర్థిక సహాయాన్ని పంపించారు. కార్పొరేటర్ జగన్ ఆధ్వర్యంలో నగదును నర్సింగ్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నర్సింగ్ కు సూచించారు. తమ పార్టీ విలేకరులకు ఎప్పుడు అండదండలిగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి బాబా, ఉపాధ్యక్షులు శ్రీధర్, నాయకులు సంతోష్, బి ఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ వేణు, పార్టీ నాయకులు బాబు గౌడ్, మల్లేష్, పాపిరెడ్డి, మహేందర్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్ బ్యూరో:**

సంక్రాంతి సెలవుల సందడి మొదలవడంతో నగరం ఖాళీ అవుతోంది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై సందడి మొదలైంది. రేపటి నుంచి విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో సంక్రాంతి సంబురాలను స్వగ్రామాల్లో జరుపుకునేందుకు జనం క్యూ కట్టారు. ఇవాళ మధ్యాహ్నం నుంచే సొంతూళ్లకు వెళ్లే వారు పయనమయ్యారు. ఎంజీబీఎస్, కూకట్?పల్లి, దిల్?సుఖ్ ?నగర్, ఎల్బీ నగర్ బస్టాండ్లు రద్దీతో కిటకిటలాడుతున్నాయి. సొంతూళ్లకు వెళ్తున్న వారితో బస్సులు నిండిపోయాయి. రద్దీకి అనుగుణంగా టీజీఎస్ ఆర్టీసీ అదనపు బస్సులు నడుపుతున్నా సరిపోవడం లేదు. అయితే ఒక్కసారిగా రద్దీ పెరగడంతో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదునుగా ప్రైవేట్ వాహన యజమానులు ధరను డబుల్ చేశారు. దీంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**సంక్రాంతి రద్దీ దృష్ట్యా 6431 స్పెషల్ బస్‌లు**

సంక్రాంతి పండుగ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ 6432 ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్?కు 1000 బస్సులను, మిగతా వాటిని తెలంగాణలోని వివిధ జిల్లాలకు నడిపిస్తోంది. నేటి నుంచి ప్రారంభం అవుతున్న ప్రత్యేక బస్సులు ఈనెల 13 వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని రంగారెడ్డి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీలత తెలిపారు. తిరిగి 18, 19 తేదీల్లోనూ స్పెషల్ బస్సులు నడుస్తాయని తెలిపారు. ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్నారు.

**కిక్కిరిసిన కూకట్‌పల్లి బస్ డిపో**

కూకట్‌పల్లి బస్ డిపోలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం డిపో నుంచి మొత్తం 306 బస్సులు నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో సాధారణంగా ప్రతిరోజూ నడిచే 180 బస్సులకు తోడు ఈరోజు ప్రత్యేకంగా మరో 125 అదనపు బస్సులు ప్రయాణికుల కోసం ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంత మందికి టికెట్స్ రిజర్వేషన్ కాకపోవడం వలన ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. మరి కొందరైతే నెల ముందే టికెట్స్ బుక్ చేసుకున్నామని తెలిపారు. రాత్రి 9 గంటల తరువాత ఈ రద్దీ మరింత పెరుగుతుందని అధికారులు అంచనావేస్తున్నారు. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**టోల్ ప్లాజాల వద్ద రద్దీ**

మరోవైపు రోడ్లపై ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోంది. రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు ట్రాఫిక్?ను నియంత్రిస్తున్నారు. ఈ రద్దీ ఎఫెక్ట్ టోల్? ప్లాజాల వద్ద కనిపిస్తోంది. యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద రద్దీ భారీగా కనిపిస్తోంది. చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల వద్ద వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. అటు యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల పోలీసులు జాతీయ రహదారిపై ఎక్కడ ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

## క్రీడా పోటీలను విజయవంతం చేయండి

- సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



**టీ మీడియా,జనవరి 9,మేడ్చల్:**

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత తమ ప్రతిభను వెలికితీసుకునేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు సమాజంలో ఐక్యత, స్నేహభావం పెరుగుతాయని చెప్పారు.జనవరి 10 నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం



**టీ మీడియా,జనవరి 9ఎండపల్లి:**

మండలంలోని గుల్లకోట,పాత గూడూరు సబ్ స్టేషన్లపరిధిలోని వినియోగదారులు అత్యవసర మరమ్మత్తుల దృష్ట్యా జనవరి 10,2026 (రెండవ శనివారం), విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాజారాంపల్లి సెక్షన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడుతుందని, ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్)బండిసమ్మయ్య తెలిపారు. ఉదయం9:00గంటల నుండిమధ్యాహ్నం 12:00గంటలవరకు గుల్లకోట, చర్లపల్లి, కొండాపూర్, పాతగూడూరు, సూరారం, రాజారాంపల్లి గ్రామాలలోని విద్యుత్వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి, సహకరించాలని విద్యుత్ శాఖ విజ్ఞప్తిచేసారూ. మరమ్మత్తులు పూర్తయిన వెంటనే, నిర్దేశించిన సమయం కంటే ముందుగానే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి కృషి చేస్తామని ఏఈ బండి సమ్మయ్య తెలియజేశారు.

## పేపర్ లీక్ గుట్టురట్టు

### 35 మంది విద్యార్థులపై వేటు




**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్ బ్యూరో:**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బి.ఎస్.సి అగ్రికల్చర్ మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి జరిగిన ఈ అక్రమం, ఒక సాధారణ కాపీయింగ్ కేసుతో మొదలై భారీ నెట్‌వర్క్‌ను బయటపెట్టింది. జగిత్యాల వ్యవసాయ కళాశాలలో పరీక్ష జరుగుతున్న సమయంలో, వ్యవసాయ శాఖలో ఏఈఓగా పనిచేస్తూ ఇన్-సర్వీస్ విద్యార్థిగా చేరిన ఒక అభ్యర్థి కాపీ కొడుతూ పట్టుబడటంతో ఈ లీకేజీ గుట్టురట్టయింది. సదరు అభ్యర్థిని లోతుగా విచారించిన అధికారులు, అతనికి ముందే ప్రశ్నపత్రం అందినట్లు గుర్తించడంతో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జానయ్య రంగంలోకి దిగి ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారుఅది బయటకు తెస్తే..ఈ విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. వరంగల్ వ్యవసాయ కళాశాల ఈ లీకేజీకి ప్రధాన కేంద్రంగా పనిచేసినట్లు అధికారులు నిర్ధారించారు. వరంగల్‌లో పనిచేసే ఒక నాన్-టీచింగ్ సిబ్బంది (క్లర్క్), అత్యంత రహస్యంగా ఉండాల్సిన ప్రశ్నపత్రాన్ని తన దుస్తుల కింద దాచుకుని కెమెరాతో ఫోటోలు తీసి, వాటిని ఒక ఇన్-సర్వీస్ విద్యార్థినికి పంపినట్లు తేలింది. అక్కడి నుండి ఈ పేపర్ వాట్సాప్ ద్వారా జగిత్యాల, అశ్వరావుపేట , సిరిసిల్ల ప్రాంతాల్లో ఉన్న సుమారు 35 మంది ఇన్-సర్వీస్ విద్యార్థులకు చేరింది. ఈ ప్రశ్నపత్రం కోసం ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 10,000 నుంచి రూ. 20,000 వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఈ అక్రమాలకు పాల్పడిన విద్యార్థులకు అత్యంత కఠినమైన సబ్జెక్టులలో కూడా 95 శాతానికి పైగా మార్కులు రావడం అధికారులకు బలంగా అనుమానం కలిగించింది. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా, విద్యార్థులు పరీక్ష మొదలైన మొదటి 15 నిమిషాలు ఏమీ రాయకుండా ఉండి, చివరి 10 నిమిషాల్లో ఓఎంఆర్ షీట్లలో సమాధానాలను వేగంగా గుర్తించడం ద్వారా తమ వద్ద ముందే సమాధానాలు ఉన్నాయని స్పష్టం చేశారు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన విశ్వవిద్యాలయ యంత్రాంగం, లీకేజీకి బాధ్యులైన నలుగురు సిబ్బందిని (ఒక ఉన్నతాధికారితో సహా) తక్షణమే సస్పెండ్ చేసింది. లీకేజీలో ప్రమేయం ఉందని తేలిన 35 మంది ఇన్-సర్వీస్ విద్యార్థులపై కఠిన చర్యలకు సిద్ధమైంది. కేవలం విద్యార్థుల వరకే కాకుండా, ఈ వెనుక ఉన్న సాంకేతిక నెట్‌వర్క్‌ను , ఆర్థిక లావాదేవీలను ఛేదించడానికి కేసును సైబర్ క్రైమ్ పోలీసులకు అప్పగిస్తున్నట్లు వి.సి జానయ్య ప్రకటించారు. హైటెక్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి కూడా విద్యార్థులు ఇటువంటి అక్రమాలకు పాల్పడటం పట్ల వర్సిటీ వర్గాలు తీవ్ర అసహనం వ్యక్తం చేశాయి. రాబోయే రోజుల్లో పరీక్ష నిర్వహణలో మరిన్ని కఠిన నిబంధనలు అమలు చేస్తామని, అర్హులైన విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని యాజమాన్యం భరోసా ఇచ్చింది.